# పాలరాతి మెట్లు

-భట్టిప్రోలు కృష్ణమూర్తి

పన్నెండేళ్ల రంజన్ డ్రాయింగ్ రూమ్‌లో ఒక మూల టేబుల్ దగ్గర కూర్చుని స్కూలు పుస్తకాలు చదువుకుంటున్నాడు. సురుచి సోఫాలో కూర్చుని ఏదో అల్లుకుంటోంది. ఇంకొక సోఫాలో ప్రక్కగా కూర్చుని మురారి ఇంగ్లీషు పత్రిక ఏదో చూస్తున్నాడు.

సోఫాలకు వేసిన కవర్లు మాసిపోయి ఉన్నాయి. పైన తిరుగుతున్న ఫాన్ చప్పుడు తప్ప ఇంకేరకమైన అలికిడీ లేదు ఆ డ్రాయింగ్ రూంలో.

సురుచి అప్పుడప్పుడు భర్త మురారి వైపు – కొద్దిగా ఆలోచనతో ముడుచుకున్న కళ్లతో – ఓరగా చూస్తున్నది.

గోడమీది గడియారంలో పెద్దముల్లు మూడంకె నుంచి ఆరంకె వరకూ వెళ్లగా చిన్నముల్లు ఏడుకూ ఎనిమిదికీ సరిగా నడుమ నిలబడింది.

రంజన్ తండ్రి వైపు తిరిగి అమాయకంగా అడిగాడు. "సైకిలు కొనిపెడతానన్నారు నాన్నా సంక్రాంతి పండుగకి?"

పత్రిక మీదినుంచి చూపులు కొడుకు మీదికి మరలించి మురారి అన్నాడు. "ఆఁ? సైకిలా? అలాగే కొందాం నాన్నా అరియర్స్ కొన్ని రావాలి ఈ నెలలో..."

కొడుకు గొంతు వినబడినప్పటి నుంచి వేళ్ల కదలిక ఆగిపోయిన సురుచి భర్త అన్నమాటలు వినగానే హేళన ధ్వనించే గొంతుతో అంది. "వస్తాయి, వస్తాయి అరియర్స్... రాగానే నీకు సైకిలు, నాకు డొక్కువాచీ బదులు కొత్త రిస్ట్‌వాచీ, బెనారస్ చీరా, నెక్లెస్, వాళ్లన్నగారి కోసం ఇన్‌వాలిడ్ చక్రాల కుర్చీ అన్నీ కొంటారు! అందరమూ అలా నోళ్లెళ్లబెట్టుకుని, కాచుకు కూచుందాం. గుమ్మం ముందు పెట్టే గొబ్బెమ్మలలా!"

జాలీ, బాధా సూచించే సన్నని చిరునవ్వు విరిసింది మురారి పెదవుల మీద.

పధ్నాలుగేళ్ల క్రిందట కొత్తగా పెళ్లై ఈ ఇంటి గడప మెట్టిన సురిచికీ ఈ సురుచికీ ఎంత తేడా! రూపంలో మరికొంత నిండుతనం సంతరించుకోవడం తప్ప ఎక్కువ మార్పులేదు భౌతికంగా– కాని మాటల్లో, ప్రవర్తనలో హస్తిమశకాంతరం! ఆ గొంతులో అప్పటి మార్దవం ఎక్కడికి పోయిందో!

వచ్చిన కొత్తలో తనకున్న ఎన్నో కోరికలు హుషారుగా ఆమె వర్ణించి చెప్పేది. ప్రతీదానికీ అలాగే అలాగే అనేవాడు– నిజానికి ఒకటొకటీ అన్నీ తీర్చగలననే అనుకున్నాడు క్రొత్తగా ఉద్యోగంలో ప్రవేశించిన తాను. తనకన్నా తక్కువ జీతగాళ్లు అంతకన్న పెద్ద కోరికలే తీర్చి భార్యలను సంతుష్టపరుస్తున్నప్పుడు తానూ అలాగే చెయ్యగలను అనుకున్నాడు– క్రమక్రమంగా తనకూ వాళ్లకూ ఉన్న తేడా తెలియవచ్చింది అతనికి.

అదీగాక రోజురోజుకూ ఆకాశమంటుతున్న ధరలతో, నెలనెలకూ తరిగిపోతున్న రూపాయి విలువతో ఏదో ఒకటీ అరా తప్ప తక్కిన కోరికలేవీ తాను తీర్చలేకపోయాడు. అసంతృప్తి నిండుకుపోతున్న సురుచి మనసులో అంతకు ముందుండే అనురాగమూ, ఆప్యాయతా లోపించుకుపోయి అసహనం పేరుకొని రోజురోజుకీ గడ్డకడుతున్నది. అర్థం చేసుకుని ఆదరంగా మాట్లాడడానికి బదులు అవహేళనా, అపశ్రుతీ పలుకుతున్నాయి ఆమె గొంతులో. భార్యా భర్తల అనుబంధం యాంత్రికంగా మటుకే మారింది వారి మధ్య.

చూపులు మరల్చుకుని మళ్లీ మౌనంగా పత్రిక పేజీలు తిరగవేయడం మొదలుపెట్టాడు మురారి.

అల్లికలో మరింత జోరుగా మళ్లీ వ్రేళ్లు కదులుతుండగా సురుచి అంటున్నది: 'పేరుకు మటుకు ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ డెప్యూటీ సెక్రటరీ! కాల్క్యులేటర్ల సహాయంతో రాత్రింబవళ్లు అన్ని డిపార్ట్‌మెంట్ల కోట్ల కొలది రూపాయల లెక్కలు కడ్తుంటారు! తీరా చూస్తే మనిషికున్నవి రెండు చింకి కోట్లే!

తానేమైనా అంటే మంటలో నెయ్యిపోసినట్లే అని తెలిసిన మురారి జవాబివ్వకుండా పేజీలు తిరగేస్తున్నాడు. కొంతసేపు ఊరుకుని చివరకు తానే అంది ఆమె. "మొన్న పార్టీలో జానకీ, రమణీ ఎంత ఇన్‌సల్ట్ చేశారు నన్ను! ఎంత బావుందో అని నా నెక్‌లెస్ జానకి మెచ్చుకోగా, అవును, చాలా బావుంది, చిలకలపూడి నుంచే డైరెక్టుగా తెప్పించారా అంది రమణి. ఏడుపొచ్చింది నాకు. ఆ వెధవ గోల్డ్ కవరింగ్ నెక్‌లెస్

తీసి విసిరి వాళ్ల మొహాన కొడ్దామనిపించింది."

నెయ్యి పొయ్యకపోయినా రాజుకుంటూంది తప్ప ఈ మంట చల్లారేటట్టు లేదు అనిపించి మురారి లేచి తన గదికి వెళ్లిపోవడమే ఉత్తమం అనుకుంటుండగా కాలింగ్ బెల్ మోగింది.

పనికుర్రాడు హాల్లోంచి వచ్చి ఒక విజిటింగ్ కార్డు మురారికి ఇచ్చి అన్నాడు. "అక్కడ కుర్చీలో కూర్చు బోట్టాను వచ్చినాయన్ని."

విజిటింగ్ కార్డు మీదికి చూపులు పోనిచ్చి అడ్రెస్, ఫోన్ నంబర్లతో పాటు "ఎం.లతీఫ్, రాజ్‌కమల్ బేక రీస్" అన్న అక్షరాలు చదివిన మురారి నొసలు చిట్లించాడు.

ఆ మరుసటి రోజు కమ్యూనిటీ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో రాబోయే సంవత్సరానికి "కేర్" సంస్థ సహాయంతో నడుస్తున్న మధ్యాహ్న – ఆహార కేంద్రాలకు బ్రెడ్ సప్లయర్స్‌ను ఎంచుకునే టెండర్ కమిటీ మీటింగ్ ఉంది. మామూలు ప్రకారం ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ సెక్రెటరీకి సి.డీ. వాళ్ల ఆహ్వానం వచ్చింది. ఫైనాన్స్ సెక్రెటరీ తనకు వేరే పని ఉందనీ, అందువల్ల తన బదులుగా డెప్యూటీ సెక్రటరీ మురారిని ఆ మీటింగుకు వెళ్లమనీ ఆదేశించాడు ఫైలులో– ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు జరిగింది ఇది. అప్పుడే ఈ సంగతి ఆ మీటింగ్ చర్చల పర్యవసానం మీద ఆసక్తి ఉన్న వాళ్లందరికీ తెలిసిపోయింది.

చిరాకుగా అన్నాడు మురారి పనికుర్రాడితో: "ఇప్పుడు వీలు కాదని చెప్పు. రేపు ఆఫీసులో కలుసుకొమ్మను."

పనికుర్రాడు వెళ్లబోతుండగా సురుచి అంది: "లేదు– ఇప్పుడే వస్తున్నారని చెప్పు వెళ్లి."

ఆశ్చర్యంగా భార్యవైపు చూశాడు మురారి. పనికుర్రాడు తటపటాయిస్తుండగా సురుచి అంది. "నీకే చెప్పింది. వెళ్లు – ఆయన్ని వెయిట్ చెయ్యమను." ఆ పిల్లవాడు వెళ్లబోయాడు. "ఏమిటిది సురుచీ!" అని నిలబడ్డ మురారి వైపు తిరిగి అంది ఆమె. "వచ్చిన పెద్దమనిషి ఎందుకొచ్చాడో కనుక్కోవడం మర్యాద!" అల్లిక సామాన్లు పాలిథీన్ బ్యాగ్‌లో సర్దుతూ అంది ఆమె. "మీకక్కడ విజిటింగ్ అవర్స్ మూడు నుంచి. అప్పుడాయన మిమ్మల్ని కలుసుకుని మాట్లాడి లాభమేమిటి? టెండర్ కమిటీ మీటింగ్ పన్నెండు కయిపోతుంది."

# స రి గ మ ప ద ని

## అందరికీ వందనాలు!

**ప**త్రిక–మన మాసపత్రిక దిగ్విజయంగా ఆరు సంవత్సరాలు పూర్తిచేసుకుని, నవంబర్ సంచికతో ఏడవ సంవత్సరంలో అడుగు పెడుతూంది.

సప్త వర్ణాలు కలిస్తే హరివిల్లు. సప్త స్వరాలు కలిస్తే సంగీత ఝరి. ఏడుకొండలు తెలుగువారి సిరి. సప్తపదీనం జీవితంలో మధుర ఘట్టం. మా రచయితల అభిమానం, పాఠకుల ఆదరం వెల కట్టలేనివి. ఈ అడుగుల వెనుక అదృశ్యంగా ఉండి ఆసరాగా నిలిచిన మహానుభావులు ఎందరో? అందరికీ వందనాలు. మన మాసపత్రిక జన్మదినం సత్యభామా విజయానికి ప్రతీకగా మనం అత్యుత్సాహంగా జరుపుకునే దీపావళి పర్వదినం సరిజోడుగా రావడం మరింత ఆనందం!

పత్రిక–మన మాసపత్రిక రెట్టించిన ఆనందంతో, రెట్టింపు సైజులో, అధిక పేజీలతో నవంబర్–2007 సంచిక దీపావళి + పుట్టిన రోజు ప్రత్యేక సంచికగా మీ ముందుకు రానున్నది. మీ కథలు, కవితలు, హాయిగా చదివించే వ్యాసాలు సకాలంలో పంపి, ప్రత్యేక సంచిక పేరు నిలపండి. రచనలు పంపే కవరు మీద "దీపావళి ప్రత్యేక సంచికకు" అని రాయండి. మీ విలువైన రచనలకు ఆ సంచికలో చోటు కల్పించలేకపోతే, తర్వాతి సంచికలలో సద్వినియోగం చేస్తాము. ఇలాంటి సందర్భాలను పెద్ద మనసుతో మీరు అర్థం చేసుకుంటారని మాకు తెలుసు, అయినా ప్రస్తావించడం మా బాధ్యత. పత్రికను యిన్నేళ్లుగా వర్ణవర్ణాలుగా తమ రచనలతో తీర్చిదిద్దుతున్న మా రచయితలు పత్రిక పుట్టిన రోజు సంచికను నవరస భరితం చేస్తారని ఆశిస్తున్నాము. మీ వెల లేని రచనలు పంపి, పత్రికను అక్షరాలా అమూల్యం చేయండి. మీ రచనలు అక్టోబరు 5వ తేదీ లోగా మాకు చేరాలని మనవి.

**చిరునామా:**

పత్రిక మన మాసపత్రిక
ప్లాట్ నెం: 103, నవ నిర్మాణ్ నగర్,
రోడ్ నెం. 71, జూబ్లీహిల్స్
హైదరాబాద్ – 500 033.

## కాపాడుకుందాం

మబ్బులు ఎవరి గురించో
వర్షించడంలేదు
పువ్వులు మరెవరి గురించో
పూయడంలేదు
సూర్యుడు ఫలానా వాళ్లగురించే
ప్రకాశించడంలేదు
చంద్రుడు ఎవరికొరకో
వెలుగునివ్వడంలేదు
గాలీ, నీరు, నిప్పు
కులం మతం లేకుండా
అందరికీ అవసరానికొస్తున్నాయి
ప్రకృతికి పక్షపాతం లేనందుకే
ప్రతి ఒక్కరికీ పనికొస్తోంది
అయితేనేం...
గుడ్డల్ని తీసేస్తున్నారూ
చెట్లను కొట్టేస్తున్నారు
చెరువుల్ని పూడ్చేస్తున్నారూ
నదుల్ని నాశనం చేస్తున్నారు
ప్రకృతి గురించి అవగాహనే లేదూ
పర్యావరణం గురించాలోచనే లేదు
మనిషి మనుగడ ప్రశ్నార్థకమంటున్నా
ఏ మనిషీ పట్టించుకోడంలేదు
'భూమి' నాదంటే నాదని
తన్నుకుంటున్నారే తప్ప
భవిష్యత్తులో భూగోళం గురించి
కించిత్తుగూడా ఆలోచించడంలేదు
ముందు తరాలకు ముప్పొస్తుందన్నా
సందేశాలే తప్ప సంచలనం లేదు.
అందుకే / సామాన్య ప్రజలారా...!
మీరైనా ఆలోచించండి
సాధారణ పొరపాట్లు చేస్తూ
వాతావరణం పాడుచేయకండి
'పర్యావరణం' గురించి
పదే పదే ఆలోచించండి
ఒక్కరు మరొక్కరికి చెబితే చాలు
కాలుష్యపు విషకోరల నుంచి
కాపాడుకోవచ్చు మన భూమిని.

-కన్నోజు లక్ష్మీకాంతం

నొసలు ముడిచి చిరాకుగా అన్నాడు మురారి: "నీకెలా తెలుసీ మీటింగ్ గురించి?"

అతనివైపు రెప్పవేయకుండా చూస్తూ అంది సురుచి: "ఇందాక మా తమ్ముడు అచ్యుతం వచ్చి చెప్పాడు. వాళ్లప్పుడే కింది నుంచి పైవరకూ అందరికీ చేతులు తడిచేసి పార్టీ ఫండుకు కూడా డబ్బు ప్రామిస్ చేశారట. ఒక్క మీరే పానకంలో పుడక! అచ్యుతం మరీ మరీ చెప్పాడు, "బావగారు ఊ అంటే మనకి లాభమే గాని ఏ ప్రమాదమూ, భయమూ లేదని."

అచ్యుతం సురుచికి దూరపు బంధువు. వరసకు తమ్ముడు అవుతాడు. హెల్త్ డైరెక్టరేట్‌లో అసిస్టెంట్‌గా ఉన్నాడు. ఆ ఉద్యోగం పేరుకే. అతనికి రెండు టాక్సీలే కాక ఇంకా వ్యాపారాలలో వాటాలున్నాయి. రెండు చేతులలోనూ డబ్బు గడిస్తున్నాడు. ఇదివరకు డైరెక్ట్‌గా తనతోనే మాట్లాడి తనను బురదలోకి దింపడానికి ప్రయత్నించాడు. అది సాధ్యంకాక ఇప్పుడు సురుచిని పట్టుకున్నాడు. డర్టీ ఫెలో.

ఎగ ఊపిరి తీసి అన్నాడు మురారి, "నీకు తెలియదు సురుచీ! భయమూ ప్రమాదమూ ప్రశ్న కాదిది! కొన్ని విలువలున్నాయి లోకంలో. అయినా మీకెవ్వరికీ ప్రమేయం లేదిందులో. నా ఉద్యోగానికి సంబంధించిన విషయమిది."

"ఉంది – సంబంధం ఉంది మాకు! అందుకే చెప్తున్నాను. అచ్యుతం చెప్పాడు నాకన్నీ. మన కుటుంబం బాగుపడాలంటే ఈ ఒక్కసారికి ఊ అనండి మీరు."

రంజన్ చదువు మాని భయంగా చూస్తున్నాడు తల్లితండ్రుల వైపు.

"అచ్యుతం!" అంటూ పెదవులు బిగించాడు. పళ్లు గిట్టకరచి మురారి. అప్రయత్నంగా "డర్టీ ఫెలో" అన్నమాట వెలువడింది, బుసకొట్టినట్టుగా.

సురుచి భర్తవైపు చురచుర చూస్తూ అంది: "వాణ్ని తిట్టకండి. మన మంచికోసమే చెప్తున్నాడు. ఈ ఒక్క రోజు..."

"ఒకసారి ఆ సారంగంలో కాలు పెడితే మరి వెనకకు రాలేం సురుచీ! అయినా వాడు చెప్పేది మన మంచికోసం కాదు. స్వార్థం కోసం. కమీషన్ దొరుకుతుంది వాడికి. అదీగాక కిందటిసారి ఆ సెంటర్స్ బెనిఫిషియరీస్ ఐడెంటిటీ కార్డుల టెండర్లప్పుడు నాకు తెలియకుండా మూడువేలు తీసుకున్నాడు అచ్యుతం! స్కౌండ్రల్! అందుకే వాడిని ఈ ఇంట్లో అడుగుపెట్ట

నివ్వవద్దని చెప్పాను నీకు."

"ఎవళ్లూ రారు మనింటికి. వాడన్నా అప్పు డప్పుడూ వచ్చి మాట్లాడితే కొంత బోర్ తగ్గుతుంది. అయినా అప్పుడు వాడు తీసుకున్నది మూడువేలు కాదు, పదిహేను వందలే. అది పూర్తిగా నాకే ఇచ్చే శాడు."

పిడుగు పడ్డట్లయిన మురారి వెర్రిగా ఆమెవైపు చూస్తూ అన్నాడు, "నీకిచ్చాడా!"

"మరి బట్టల దుకాణం వాడి బాకీ ఎలా తీరిందను కున్నారు?"

"దాంతో బాకీ తీర్చావా! ఇంకా ఇంటి ఖర్చుల్లో మిగిల్చి తీర్చావనుకున్నాను."

"జానెడు బెత్తెడు కడిగిపెట్టిన రాళ్ల సంపాదనలో మిగిలించడం కూడానా!" లోపలి గుమ్మం వైపు నడుస్తూ అంది సురుచి. "ఏమో, మీ ఇష్టం– మొత్తం ముప్ఫై వేల వరకూ రేపు సాయంత్రానికి మన చేతుల్లోకి రావడానికి వీలుందిట. కొద్దిగా మీరు బెట్టుచేస్తే దానికి డబుల్ కూడా అవవచ్చునట." గుమ్మం మీద చేయి వేసి, వెనుకకు తిరిగి రెప్పవేయకుండా అతనిని చూస్తూ అంది సురుచి. "ఈ అవకాశం జారిపోతే రేపు రాత్రికి నన్నీ ఇంట్లో మరి చూడరు."

హఠాత్తుగా లేచి నిలబడి అన్నాడు రంజన్ గట్టిగా: "అమ్మా– ఏమిటమ్మా ఇది?"

ఆ పసిగొంతు వాళ్లిద్దరి చెవులలోనూ చొరబడ లేదు. వెళ్లిపోబోతున్న సురుచితో "ఆగు సురుచీ!" అని గట్టిగా అన్నాడు మురారి. ఆమె ఆగింది. "ఏమిటి, నీ మాటల కర్థం?"

"అదే– రేపు సాయంత్రం మా అన్నయ్య దగ్గిర కెళ్లిపోతాను నేను, నేనన్నది మీరు కాదంటే."

ఒక్కుదుటున తల్లి దగ్గరకు వచ్చి భుజాలు పట్టుకుని గాభరాగా అన్నాడు రంజన్: "ఏమిటమ్మా ఇది? నాకు సైకిలూ వద్దు, గియిక్‌లూ వద్దు. మీరు దెబ్బలాడుకోకండి, దణ్ణం పెడ్తాను. నాన్న వ్యవహారా లలో నువ్వు కలుగజేసుకోకు."

కొడుకు చేతులు విదిలించికొట్టి అంది సురుచి: "నువ్వు నోరుమూసుకో. నేనుమటుకిక ఓర్చుకోలేను. నువ్వూ మీ నాన్నా వెళ్లి ఏ గంగలోనన్నా దూకండి రేపు రాత్రి" చరచరా నడుచుకుంటూ వెళ్లి మెట్లెక్కుతున్న తల్లిని వెంబడించి "అమ్మా అమ్మా" అంటూ అనుసరిం చాడు రంజన్.

వడివడిగా ఊపిరి తీస్తూ వాళ్లు వెళ్లిన వైపే చూస్తూ నిలబడిన మురారి కొన్ని క్షణాలకు సర్దుకుని ముందు హాలు లోపలికి వెళ్లే గుమ్మంవైపు నెమ్మదిగా నడిచాడు.

❖ ❖ ❖

అంతకు ముందు ఇటువంటి వ్యవహారాల వివరాలు తెలుసుకోడానికి ఏమాత్రమూ కుతూహలం చూపించకుండా అన్నిటికీ దూరంగా ఉంటూ వచ్చిన మురారి ఈసారి మటుకు ఈ గూడుపుఠాణీ అంతు కనుక్కోవాలని నిశ్చయించుకుని, మర్యాదగా లతీఫ్‌ను పలకరించి, పనికుర్రవాడి చేత రెండు కూల్‌డ్రింక్స్ తెప్పించి అతనికొకటి ఇచ్చి తానూ అతనితోపాటు త్రాగుతూ సంగతి పూర్తిగా తెలుసుకున్నాడు.

లతీఫ్ చెప్పినదాని సారాంశం ఇది.

మొత్తం టెండరర్లు ఎనమండుగురు ఉన్నారు. అం దులో ముఖ్యమైన వాళ్లు, పలుకుబడి ఉన్నవాళ్లు ముగ్గురు మటుకే– రాజ్‌కమల్ బేకరీస్, ఉషా కాటరర్స్, బాంబే హోటల్. తమలో తాము పోటీపడడం వల్ల రేట్లు తగ్గిపోవడం తప్ప ప్రయోజనం ఉండదని గ్రహిం చిన ఈ ముగ్గురూ కూడబలుక్కుని, మొత్తం రాష్ట్రం అంతా మూడు ప్రాంతాల క్రింద విభజించుకుని, ఒక్కొక్క ప్రాంతానికి ఒక్కొక్కరు సప్లయర్స్‌గా ఉండ డానికి నిర్ణయించుకున్నారు. క్రింది నుంచి పైవరకూ– విభాగపు మంత్రిగారితో సహా అందరికీ ఎవరికి ఇవ్వవలసింది వారికి ఇవ్వడానికీ, రూలింగ్ పార్టీ ఫం డుకు అయిదు లక్షలు డొనేషన్ రహస్యంగా ఇవ్వడానికీ స్థిరమైంది. ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ తరఫున హాజరయ్యే వ్యక్తి– అంటే మురారి– ఏ అడ్డూ చెప్పకుండా ఉంటే అంతా సవ్యంగా అవుతుంది. మురారికి మొత్తం ముప్ఫైవేలు ముడుతుంది.

అంతా విన్న మురారి నెమ్మదిగా అడిగాడు: "మరి మా ఫైనాన్స్ సెక్రెటరీ తానే స్వయంగా మీటింగ్‌కు వెళ్లకుండా నన్నెందుకు వెళ్లమన్నాడు?"

నవ్వి అన్నాడు లతీఫ్: "ఎంత అమాయకులండీ మీరు... ఉషా కేటరర్స్ ఎవరిదనుకున్నారు? అసలు ప్రొప్రయిటర్ మీ సెక్రెటరీ గారే! బినామీ!"

అది విన్న మురారి నిర్విణ్ణుడయ్యాడు. అతనికి ఒళ్లంతా ముళ్లూ, సూదులూ గ్రుచ్చుకుంటున్నట్లుగా ఉంది. పోషణ సరిగా లేని లక్షలాది బాల బాలికలూ, ఏ ఆధారమూ లేని వృద్ధులూ, గర్భిణీలూ మొదలైన వారి శ్రేయస్సు కోసం ఉద్దేశించిన పథకంలో ఎంత అవినీతి! ఎంత అత్యాచారం!! ఒక్కొక్క రొట్టెముక్క ఖరీదులోనూ ఇరవై ముప్ఫై పైసలే అనధికార లాభం,

న్యాయంగా వచ్చేదానిమీద. కాని రాష్ట్రం మొత్తంమీద కొన్ని వేల ఆహార కేంద్రాలలో లెక్కచూస్తే రోజుకు ఏభై అరవై వేల రూపాయల పైనే - అంటే సంవత్సరానికి రెండు మూడు కోట్ల రూపాయలు- - పథకపు అసలు ప్రయోజనం నుంచి "నల్ల" ప్రయోజనానికి సైఫన్ అయిపోతుంది చల్లగా! ఆ సైఫన్ గొట్టంలో ఒక చిన్న అతుకు ముక్కగా ఉండడానికి తనకు ముప్పై వేలు ముడుతుంది - రొట్టెముక్క తింటూ కలవాడు విసిరి వేసు క్రంచ్స్-తునకలు- కోసం చొంగలు కారుస్తూ నాలికలు చాపుకు ఎగబడే కుక్కలలో తానూ ఒకడు కాదలిస్తే!

ఈ ఆలోచనలలో ఉన్న మురారి లతీఫ్ తన బాగ్‌లోనుంచి ఏదో పైకితీసి బల్లమీద పెట్టడం ముందు గమనించలేదు - లతీఫ్ అన్న మాటలతో మళ్లా ఈ లోకంలో పడేటంతవరకూ: "పదిహేనుంది ఇందులో- పని అయ్యాక రేపు సాయంత్రం తక్కిన పదిహేనూ నేనే స్వయంగా వచ్చి ఇస్తాను."

వెర్రిగా బల్లమీది వస్తువు వైపు చూశాడు మురారి. తెల్లగా గడ్డకట్టిన పాలమీగడ దిమ్మలా ఉన్న కవర్ అది.

సురుచి అన్నమాటలు మార్రోగాయి అతని

## శారద నానీలు

పని లేని స్త్రీలు
ముంగిట్లో కూచొని
ముచ్చట్లు
ఎవరింటికి ఎసరోమరి?
కొమ్మైతేమి, కొడుకైతేమి?
సరిగాలేనపుడు
వంచాలి
తప్పదు.
'ఆమె
ఒయ్యారాలు ఒలుకబోస్తుంది'
కామెంట్ చేసేది
మగాళ్ళు కాదు స్త్రీలే!
చికన్‌గున్యా, డెంగ్యూలంటూ
పీడిస్తున్నాయి
దోమకాటుకు
మందేది?

-సబ్బని శారద

చెవులలో: "కొద్దిగా మీరు బెట్టుచేస్తే డబుల్ అవుతుంది మనకు ముట్టేది!"

ఆ కవరు మందం రెట్టింపు అవుతుంది!

మీగడా వెన్నా అందరికీ ఇష్టం ఉండదు- అది చూడగానే వాంతి అయినట్లవుతుంది వాళ్లకు. అసలు మీగడా వెన్నా అంటే ఇష్టం ఉన్న మురారికి మటుకు ఆ క్షణాలలో వాంతి అయినట్లే అయింది.

నవ్వుతూ అన్నాడు లతీఫ్: "సందేహించకండి సార్ - ఈవాళా రేపూ ఇండియాలో సౌత్ బ్లాక్ నుంచి సదరన్ మోస్ట్ టిప్ వరకూ పారాదీప్ నుంచి మార్మగోవా వరకూ జరుగుతున్నదిదే." ఇంకా మురారి వెర్రిగా కవరు వైపే చూస్తూ మౌనంగా ఉండిపోవడంతో లతీఫ్ మృదువుగా అన్నాడు!

"చూడండి సార్- నాకు ఈ బేకరీస్ ఒక్కటే కాదు- ఇంకా చాలా బిజినెస్సులున్నాయి. అదీగాక మన రాష్ట్రంలో స్టేట్ ప్రొడక్టివిటీ కౌన్సిల్‌కి సెక్రటరీని నేనే. నా మాట వేదవాక్యం అక్కడ. ఇది మన పరస్పర వ్యవహారాలకు నాందిమటుకే!" ఆగి కొంటెగా నవ్వి అన్నాడు, "మీరు రిటైరయ్యేటప్పటికి మాలో ఎవరితోనైనా పార్టనర్‌గా ఉండడానికి మీరూ సిద్ధంగా ఉంటారు."

లోపలికి పీల్చి ఉంచిన ఊపిరి గట్టిగా పైకి వదిలి ఆ కవర్ తీసుకుని డ్రాయర్ లాగి అందులో పడవేశాడు మురారి.

❖ ❖ ❖

మురారి చెప్పినదంతా విన్న చీఫ్ సెక్రెటరీ చంద్రశేఖర్- ఏ రకపు మీగడైనా అసహ్యించుకునే మనిషి కనుక వెంటనే డైరెక్టర్ జనరల్ ఆఫ్ విజిలెన్సుకు ఫోన్‌చేసి అక్కడికి పిలిపించి- మురారి ఇచ్చిన డబ్బు కవర్ సీజ్‌చేయించి ఆ తరువాత మురారి వైపు తిరిగి అన్నాడు: "వెళ్లి నువ్వు మామూలుగా టెండర్ కమిటీ మీటింగ్ అటెండ్ అవు- ఏదో కారణం చూపించి మీటింగ్ రెండు మూడు వారాలు పోస్ట్‌పోన్ చేయించు. తక్కిన సంగతి నేను చూసుకుంటాను."

ఎంతో బరువు తీరిపోయినట్లయిన మురారి "ఎస్ సార్" అన్నాడు.

❖ ❖ ❖

సీ.డీ. డిపార్ట్‌మెంట్ సెక్రెటరీ దుర్గాప్రసాదం గారి గదిలో టెండర్ కమిటీ మీటింగ్ ప్రారంభం అయింది. అతడు అడుగు రాంక్ నుండి పైకెగ్రబాకి చివరకు ఐ.ఏ.ఎస్.కు ప్రమోట్ అయిన మనిషి కనుక అన్ని

విషయాలలోనూ అనుభవజ్ఞుడు.

కమిటీ మెంబర్లు మొత్తం అయిదుగురు – దుర్గా ప్రసాదం, సీ.డీ. డైరెక్టర్ మన్‌మోహన్ సిన్హా (ఇతడు డైరెక్ట్ ఐ.ఏ.ఎస్.), సీ.డీ. డిపార్ట్‌మెంట్ డెప్యూటీ సెక్రెటరీ తిరుపతిరావూ, మురారీ (ఈ ఇద్దరూ రాష్ట్ర ప్రభుత్వం సర్వీస్‌లో సీనియర్ అధికారులు), అయిదవ వ్యక్తి ఎన్నో సాంఘిక సేవా కార్యకలాపాలలో పాల్గొంటూ ప్రజా సేవకుడుగా ప్రఖ్యాతి గాంచి పద్మశ్రీ బిరుదంతో సమ్మానితుడైన రఘుపతీ. తిరుపతిరావు కమిటీకి మెంబర్ సెక్రటరీ. వీళ్లుగాక ఆ గదిలో ఆ డిపార్ట్‌మెంట్ అండర్ సెక్రటరీ జగ్గారావు వేరేగా ఒక బల్ల దగ్గర కూర్చుని ఉన్నాడు. ఆ బల్లమీద రొట్టెల శాంపుల్స్ నీటుగా పేర్చి ఉన్నాయి, వేరు వేరు లేబుల్స్‌తో.

మెంబర్లు అందరు ముందూ పెద్ద కంపారిటివ్ స్టేట్‌మెంట్స్ (టెండర్ల పూర్తి వివరాలు కల కాగితాలు) ఉన్నాయి.

దుర్గాప్రసాదం అంటున్నాడు: "సప్లయర్స్‌ను ఎంచుకునే ముందు మనం వారి పుట్టు పూర్వోత్తరాలూ శక్తి సామర్థ్యాలూ పరిశీలించి చూడాలి. టెండ రివ్వ దానికేమి అడ్డం ఉంది? వంద రూపాయల్తో సైన్‌బోర్డ్ చేయించి బిజినెస్ పెట్టిన ప్రతీవాడూ ఏదో గాలికి తానూ టెండరర్‌గా నిలబడవచ్చు ఒక మొనగాడినని. సంవత్సరం పొడుగునా క్వాలిటీ నిలబెడుతూ సప్లయి సవ్యంగా చేసే శక్తి ఉందో లేదో చూడాలి మనం. ఏమంటారు రఘుపతిగారూ?"

చుట్ట పొగ పీల్చి వదులుతూ అన్నాడు పద్మశ్రీ రఘుపతి: "మీరు చెప్పింది కరెక్టే! ఈవాళా రేపూ కుక్కగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి ఎంటర్‌ప్రైజెస్."

ఈ కొలబద్ద పెట్టి ఒక్కొక్క టెండరర్ గురించి వివరాలు వర్ణించి మొత్తం ఎనమండుగురిలోనూ అయిదుగురి పేర్ల ఎదుట ఎర్రసిరాతో ఇంటూ మార్కు పెట్టి తలపైకెత్తి అన్నాడు దుర్గాప్రసాదం: "అందరూ నాతో ఏకీభవిస్తే ఈ మిగిలిన ముగ్గురి పేర్లు టిక్ చేస్తాను?"

పైప్ పీలుస్తున్న సిన్హా ఆ పొగ సెక్రటరీ వైపు వదిలి 'ఎగ్రీడ్' అన్నాడు, సార్ అని అనకుండా. కన్‌ఫర్డ్ ఐ.ఏ.ఎస్. ఆఫీసర్లంటే అతడికి నిరసన. కనీ కనిపించకుండా తలాడించాడు తిరుపతిరావు. పద్మశ్రీ మరొక చుట్ట వెలిగించుకుంటూ "మీతో నేనేకీభవిస్తున్నాను" అన్నాడు.

మౌనంగా ఉండిపోయిన మురారి వైపు చూసి– అన్నాడు సెక్రెటరీ? "మీరేమంటారు మిస్టర్ మురారీ? ఫైనాన్స్ వాళ్ళు, మీ మాటే ముఖ్యం. రేపు పొద్దున తక్కువ రేట్లు కోట్‌చేసిన టెండర్లు అన్యాయంగా రిజెక్ట్ చేశామని పుల్ల పెట్టకూడదు మీరు. ఇంకా మురారి జవాబివ్వకపోవడంతో కొద్దిగా బెదిరింపు గొంతుతో అన్నాడు దుర్గాప్రసాద్: "మీ సెక్రటరీ నగేశ్‌తో డిస్కస్ చేశానప్పుడే. దీనికి కన్‌సెంట్ ఇచ్చాడు."

ఇంతలో రిఫ్రెష్‌మెంట్స్ వచ్చాయి. సెక్రటరీ నవ్వుతూ "మిడ్ డే మీల్స్ టెండర్ కమిటీ వాళ్లకు మిడ్–సెషన్స్, రిఫ్రెష్‌మెంట్స్. ముందీ పని చూద్దాం, తరువాత బిజినెస్"

అల్పాహారమూ, కూల్‌డ్రింకులూ, కాఫీ పూర్తయ్యాక తన టేబుల్ డ్రాయర్ నుంచి స్మగుల్డ్ విదేశీ సిగరెట్ పాకెట్ తీసి మురారి వైపు చేయిజాపి అన్నాడు దుర్గాప్రసాదం: "హేవ్ వన్ మిస్టర్ మురారీ!"

## అతడు

అతడు ఒక నిరుపేద
అతడు స్వాప్నిక జగత్తులో విహరించి
ఆ స్వప్నాలను సాకారం చేసుకున్న ఘనుడు
అతడు ప్రకృతి ప్రేమికుడు, షహనాయి అభిమాని
అతడు పర్యావరణ పరిరక్షకుడు
అతడు సర్వమత సామరస్య భావుకుడు
అతడు పోఖ్రాన్ ఇసుక రేణువుల్లోనే గాక
కోట్లాది యువజనుల మనసులలో ప్రజ్వరిల్లిన 'అగ్ని'
అతడు విద్యార్థుల హృదయాంతరాల్లోకి చొచ్చుకుపోగల 'నాగాస్త్రం'
అతడు శత్రువుల గుండెల్ని చీల్చగల 'త్రిశూలం'
అతడు శాస్త్ర రంగంలో కీర్తిగడించిన 'పద్మభూషణుడు'
అతడు చదువుల తల్లి ఒడిలో
ముద్దుగా ఒదిగిన "వీరసావర్కర్"
అతడు గగనతలంలో విహరించే 'వింగ్స్ ఆఫ్ ఫైర్'
అతడు అందరి డెందాలలో
ఆనంద వీచికై నిలచిన "పృథ్వి"
అతడు ఒక మిస్సైల్ మాష్టర్
అతడు ఎందరికో స్ఫూర్తి నింపిన "భారతరత్నం"
అతడు...? అతడే... 'అబ్దుల్ కలాం'.

– ఎస్.వి.ఎస్.ఎస్.ప్రభాకరాచార్యులు

## సాగుబడి

జడ్డిగంలోంచి
నేలబారుగా జారిపడి
సాలుసాలునా లోపలకు జొరబడి
మొలకెత్తే విత్తనాల్లో
నా మస్తిష్కంలోంచి
అక్షరాలు వందలు వేలుగా ఏర్పడి
కవితలుగా అల్లుకుపోతున్నప్పుడు
నా ఆనందానికి అవధులుండవు...

ఎదిగిన పైరు తలలూపుతూ
నేను పొట్టకు రాబోతున్నానని
గుర్తు చేసినప్పుడు
నా కవితలన్నీ గుదిగుచ్చి
ఓ సంపుటిగా రూపుదిద్దుకున్నంత సంతోషం

తలబరువుతో వరికంకులు వొంగిపోయి
కోతకు సిద్ధమవుతున్నామని
తెలియజేసినప్పుడు
నా కృషి ఫలవంతమైనదని
నా 'సంపుటి' ఆవిష్కరింపబడినంత ఆనందం

వరిని కోసి కట్టలు కట్టి
పనలు పనలుగా ఎండబెట్టి
గూడుకట్టి...
ఆకాశం నిర్మలంగా ఉండగా
గింజలుకొట్టి... చేటలో... తూర్పారబడితే
పొల్లు రాలడానికి ఎగిరి
గాలిలో దూగర దూగరా కలిసి ఎగిరిపోయినప్పుడు
నా కవితా సంపుటి
పత్రికల్లో సమీక్షల గౌరవాన్ని అందుకుని
ప్రశంసార్హమై నిలిచినంత ప్రమోదం

ఆరుగాలాలపాటు కష్టపడిన కృషీవలునిగా
అక్షర శ్రామికుడినై...
పది కాలాలపాటు కవితా వ్యవసాయం చేయాలన్న తపన
నన్ను నిత్యం... తన్మయత్వంతో మురిసిపోయేలా చేస్తుంది–
కృషితో నాస్తి దుర్భిక్షమన్న సూక్తి... సుస్వరమై వీనుల చెంత నిలుస్తుంది

**–రావెల పురుషోత్తమరావు**

"థాంక్యూ, నో సార్!"

నవ్వి అన్నాడు సెక్రెటరీ: "ఇక్కడ కాడర్ ప్రశ్న లేదు మురారీ! ఆల్ టెండర్ కమిటీ మెంబర్స్ ఆర్ ఈక్వల్. అందులో మీరు మోర్ ఈక్వల్ అమాంగ్ ఈక్వల్స్. ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ రిప్రజెంటేటివ్‌గా. తీసుకోండి, కాల్చండి."

తన స్వప్రయోజనం కోసం కాకాపడుతున్నాడని బోధపడింది మురారికి. "అలవాటు లేదు సార్..."

"ఓ దెన్, ఓకే..." అని తన సిగరెట్ వెలిగించుకున్న దుర్గాప్రసాదం మురారి వైపు తిరిగి అన్నాడు: "అయితే ఈ ముగ్గురి పేర్లూ టిక్ చేస్తాను?"

నెమ్మదిగా ఒక్కొక్క మాటా స్వచ్ఛంగా పలుకుతూ అన్నాడు మురారి: "చూడండి సార్– టెండర్ నోటీస్‌లో బ్రెడ్ కంటెంట్స్‌కి స్పెసిఫికేషన్స్– అంటే కార్బోహైడ్రేట్స్, విటమిన్స్, ప్రొటీన్స్, మైదా మొదలైన వాటి పాళ్ల పరిమాణాలు వివరించారు. ఈ టెండరర్స్ ఇచ్చిన శాంపిల్స్ వాటికి సరిగా సరిపోతున్నాయా? ఇవి పరీక్ష చేయించి అనాలిసిస్ రిపోర్టులు సిద్ధం చేశారా?"

అతని మాటలు బాంబు పేలినప్పుడు స్పింటర్లలా అన్ని ప్రక్కలకూ త్రుళ్లాయి. మిగిలిన మెంబర్లందరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. మురారి అందరి మొహాలూ పరీక్షగా చూశాడు. ఎవ్వరి నోటిలో నుండీ ఏ ఒక్క మాటా పైకి రాలేదు.

జూలియస్ సీజర్ నాటకంలో మాటలు జ్ఞాపకం వచ్చాయి మురారికి– "అందరూ పెద్దమనుషులే!" ఈ అందరూ సంఘంలో పరపతి ఉన్నవాళ్లే! కాని... కాని...

తెప్పరిల్లిన సెక్రెటరీ అన్నాడు, "చూడండి మిస్టర్ మురారీ. అలాటివన్నీ ఫార్మాలిటీస్. రెడ్ టేపిజం చిహ్నాలూ. ఇది స్పీడ్ యుగం. జెట్–ప్లేన్. పనులు చకచకా సాగాలి. నిజానికి మన నోళ్లకంటే ఏ లేబొరేటరీలు ఎక్కువగా అనలైజ్ చేయగలవు తినే పదార్థాలని? కావాలంటే అందరమూ తర్వాత టెండరర్స్ తాలూకూ రొట్టె ముక్కలు సాంపుల్‌గా తిని చూద్దాం. ముందీ ప్రొసీజర్ ఆఫ్ ఎలిమినేషన్ గురించి..."

మురారి నిశ్చలంగా అన్నాడు: "రుచి ప్రశ్న కాదు సార్. కంటెంట్స్ చూడండి, ఇక్కడ సెంట్రల్ గవర్నమెంట్ వాళ్ల ఫుడ్ క్రాఫ్ట్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ ఉంది. మన రాష్ట్ర ప్రభుత్వపు సంస్థలూ చాలా ఉన్నాయి. ఈ శాంపిల్స్ వాళ్లలో ఎవళ్లకన్నా పంపి అనలైజ్ చేయించి రిపోర్టులు తెప్పించండి ముందు. ఆ సంస్థల అధికార్లలో

ఎవరినన్నా ఒకరిని టెండర్ కమిటీ మెంబర్‌గా కో ఆప్ట్ చేయండి. రిపోర్టులు వచ్చిన తర్వాత మరొక మీటింగ్ రీ కన్వీన్ చేయించండి. అంతవరకూ ఈ మీటింగ్ పోస్ట్‌పోన్ చేయమని ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ తరఫున నా ప్రార్థన.

పద్మశ్రీగారు కలుగజేసుకుని మురారికి నచ్చచెప్ప డానికి ప్రయత్నించాడు. కాని లాభం లేకపోయింది. చివరకు ఆరోజు మీటింగ్ పోస్ట్‌పోన్ అయింది, అనిర్ధారితమైన తారీఖు వరకూ.

❖ ❖ ❖

ఆ రాత్రి ఏడు దాటిన తరువాత తిరిగి వచ్చాడు ఇంటికి మురారి. ఇదివరకంతా ప్రసన్నంగా మాట్లాడే సెక్రెటరీ ధుమధుమలాడ్తూ ఎందుకో ఒకందుకు మురారిని పిలిచి చీవాట్లు పెడుతూనే ఉన్నాడు ఆ మధ్యాహ్నం పన్నెండు గంటల నుండీ.

తప్పనిసరిగా పోస్ట్‌పోన్.

❖ ❖ ❖

ఆ రాత్రి ఇంటికి వచ్చేటప్పటికి ఇల్లంతా చీకటిగా ఉంది. పని కుర్రవాడు హాలులో కూర్చుని ఏడుస్తూ అన్నాడు: "అమ్మగారు వెళ్లిపోయారు బాబూ ఇందాక రైల్‌లో!"

తండ్రి రాక అలికిడి విన్న రంజన్ లోపలి నుండి వచ్చి "నాన్నా!" అంటూ తండ్రి కౌగిట్లో ఒదిగి పోయాడు.

నరకానికి దిగడానికి పాలరాతి మెట్లు ఉంటాయి. ఏ కష్టమూ లేకుండా దిగిపోవచ్చు. కాలికి నొప్పి లేకుండా పూలరేకులు కూడా పరిచి ఉంటాయి ఆ మెట్ల మీద. కాని ఇల్లు చీకటి కావడానికన్నా ఒప్పుకుం టాడు కాని ఆ మెట్ల మీద అడుగు వేయలేని మురారి జాలిగా శూన్యంలోనికి చూస్తూ కుమారుడి తల నిమురుతూ ఉండిపోయాడు.

❖ ❖ ❖

వారం రోజులకు మురారికి ఆ ఫైనాన్స్ డిపార్ట్ మెంట్ నుంచి ఊరూ పేరూ లేని ఒక మారుమూల స్థలానికి బదిలీ అయింది. రెండు నెలలకు చీఫ్ సెక్రటరీ కూడా కేంద్ర ప్రభుత్వానికి వెళ్లిపోయాడు బదిలీమీద. డైరెక్టర్ ఆఫ్ విజిలెన్స్ సీజ్ చేసిన పదిహేను వందలకు అతీగతీ లేదు.

రాజకమల్, ఉషా కేటరర్స్, బొంబాయి హోటళ్ల టెండర్లు రాష్ట్రంలో మూడు ప్రాంతాలకు ఆ తరువాతి మీటింగులో మంజూరు అయ్యాయి. ■

## 'గ్యాస్' బండలు

ఆడవాళ్ళ మాట
'గ్యాస్' అని
కొట్టిపారేయకండి!
బతుకుల్ని వెలిగిస్తారు-
తప్పకపోతే
మిమ్మల్నీ అంటిస్తారు!

## సాహిత్య సభ

వక్తల్ని / తిననిచ్చాక
మిగిలిందే తినాలి-
అధ్యక్షుడంటే / అమ్మలాంటివాడు!

## సమాజ దేహం

మేధావి- తలకాయ,
వీరుడు- గుండెకాయ,
ఇద్దరినీ కలిపే
"ఒకే లక్ష్యం"- మెడకాయ!

## మహాగమ్యం

మా అబ్బాయికి
ఈ చదువులొద్దు!
రాజకీయాల్లో
చేరుతున్నాడు!
అష్టకష్టాలు పడి చదివిన
డాక్టర్లను ఇంజినీర్లను
రేపు వాడే కొంటాడు!

## మానవత

పురుషుడు-పాలు, / స్త్రీ-నీరు,
దాహం తీర్చేది / పాలు కాదు-
నీరు!

## అధికార 'రాజ'సం

వెలుతురు పడితే
మన 'కబ్జా' భూమిని
ప్రజలకు పంచుదాం!
చీకటి పడితే / భూగోళాన్ని
ఆక్రమించుదాం!

-రావి రంగారావు